క్లుప్తంగా

షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

విజయనగరం గంటస్తంభం: పట్టణంలోని రింగ్‌రోడ్డు సింహాద్రినగర్‌లో గల షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున భక్తులు బాబా చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ అధ్యక్షుడు కరణం జనార్దనరావు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీరామ్‌శర్మ, సందీప్ శర్మ బాబాకు క్షీరాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేపట్టారు. మధ్యాహ్నం సుమారు 250 మందికి అన్నదానం చేశారు.

సెంచూరియన్‌లో సైన్స్ దినోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మానవ జీవితంలో సైన్స్ పాత్ర – యోగాపై పరిశోధన అనే అంశంపై మహబుబాబాద్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ ప్రసంగించారు. ఈ సందర్భంగా రామన్ ప్రభావం, యోగాలో సైన్స్ పాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీన్లు ఎంఎల్‌ఎన్ ఆచార్యులు, దినేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోసాని అరెస్ట్ బాధాకరం



రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: సినీ నటుడు పోసాని కృష్ణమురళిని అక్రమంగా అరెస్ట్ చేయడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు రేగాన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సీతారామునిపేటలో గురువారం ఆయన మాట్లాడుతూ.. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా అతని ఇంట్లోకి ప్రవేశించి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కేవలం ఒక రాజకీయపార్టీ కార్యకర్త ఫిర్యాదు చేస్తే నిజానిజాలు తెలుసుకోకుండా ఎలా అరెస్ట్ చేస్తారని, ఇది కక్ష సాధింపు కాదా? అని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతోనే కూటమి ప్రభుత్వం కాలాన్ని వెళ్లదీస్తోందని, సంక్షేమ పథకాల అమలును గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

రామతీర్థంలో ప్రత్యేక పారిశుధ్య పనులు



రామతీర్థం జాతరలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథం

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టామని ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథం తెలిపారు. రామతీర్థంలో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతరకు విచ్చేసిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా వివిధ గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికుల సహకారంతో రెండు రోజుల పాటు ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేశామన్నారు. 12 మంది కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పారిశుధ్య పనులను పర్యవేక్షించారని చెప్పారు. మరో రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పూర్తి స్థాయిలో చెత్తను తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం పంచాయతీ దేవుని నెలివాడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ పి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామతీర్థం, సీతారామునిపేట, గొర్లిపేట, కొత్తపేట, సువ్వానిపేట, నెల్లిమర్ల పంప్‌హౌస్, థామస్‌పేట, జరజాపుపేట పంప్ హౌస్, రైల్వే పంప్‌హౌస్, ఎంపీడీఓ కార్యాలయం, గురుకుల పాఠశాలలు, నెల్లిమర్ల జగనన్న కాలనీ, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తజనం..

- ప్రశాంతంగా ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు
- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



పుష్కర ఘాట్ వద్ద వద్ద భక్తుల పుణ్యస్నానాలు



జాతరలో భక్తుల రద్దీ



దన్నానపేట రహదారిలో ట్రాఫిక్ ఇక్కట్లు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో మహాశివరాత్రి ఉత్సవాలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. రెండు రోజుల పాటు సాగిన ఈ జాతరలో సుమారు లక్షకు పైగా భక్తులు శివ, కేశవులను దర్శించుకున్నట్లు అంచనా. ఆలయ ప్రాంగణం, కల్యాణ మండపం, బోడికొండ, తదితర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి. సమీపంలో గల నీలాచలం బోడికొండ, రామస్వామి వారి ఆలయం, కోనేరు గట్టు, తదితర ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందు రోజు రాత్రంతా జాగారాలు చేసి ఉదయాన్నే రామ కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సీతారామస్వామివారిని పక్కనే ఉన్న ఉమాసదాశివ స్వామివారిని అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు ఉమా సదాశివాలయంలో లింగోద్భవ పూజలు వైభవంగా జరిగాయి. ఆ సమయంలో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పోటీ పడ్డారు. భోగాపురం, పూసపాటిరేగ, లావేరు, రణస్థలం, భీమిలి, విశాఖపట్నం, తదితర ప్రాంతాల నుంచి మత్స్యకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ప్రతిమను మధ్యలో ఉంచి చుట్టూ వృత్తంలా ఏర్పడి సంప్రదాయబద్ధంగా నృత్యాలు చేశారు. అలాగే బోడికొండపై ఉన్న చారిత్రక ఆధారాలను చూడడానికి అధిక సంఖ్యలో సందర్శకులు తరలివెళ్లారు.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం..

స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో సీతారామునిపేట, దన్నానపేట జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు సగం మంది పోలీసులు వెళ్లడంతో ట్రాఫిక్‌ను నియంత్రించడం కష్టతరంగా మారింది. స్వచ్ఛందంగా సేవలో పాల్గొన్న ఎన్‌సీసీ వలంటీర్లు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు కష్టాలు పడ్డారు. ప్రధాన జంక్షన్ల వద్ద ఎన్‌సీసీ వలంటీర్లే పోలీసులుగా మారి తమ సేవలను అందించారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రామకృష్ణ, ఎస్సై గణేష్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి ప్రసాద్, ఈఓ శ్రీనివాసరావు, తదితరులు మహాశివరాత్రి ఉత్సవాలను దగ్గరుండి పర్యవేక్షించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు జమదగ్ని, తదితరులు

పూసపాటిరేగ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో శతశాతం పోలింగ్ జరిగింది. పూసపాటిరేగ మండలంలో 64వ పోలింగ్ కేంద్రంలో 30 ఓట్లకు గాను 30 మంది.. భోగాపురం మండలంలో 65వ పోలింగ్ కేంద్రంలో 35 ఓట్లకు గాను 35 మంది.. డెంకాడలో 66వ పోలింగ్ కేంద్రంలో 75 ఓట్లకు గాను 72 మంది.. నెల్లిమర్లలో 63వ పోలింగ కేంద్రంలో 183 ఓట్లకు గాను 177 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల పరిశీలకులు జమదగ్ని, ఇమ్రాన్ ఎన్నికల కేంద్రాలను పరిశీలించారు.

నోటీస్ బోర్డుల్లో బకాయిదారుల జాబితా



కార్పొరేషన్ కార్యాలయంలో బకాయిదారుల జాబితాను ప్రదర్శిస్తున్న రెవెన్యూ అధికారులు

విజయనగరం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024 – 25) సంబంధించి ఇప్పటివరకు ఉన్న ఆస్తి, ఖాళీ పన్ను బకాయిదారుల వివరాలు నోటీసు బోర్డులోకి ఎక్కాయి. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంతో పాటు నగర పరిధిలో గల అన్ని వార్డు సచివాలయాల పరిధిలో బకాయిదారుల వివరాలను కార్పొరేషన్ రెవెన్యూ అధికారులతో పాటు అన్ని సచివాలయ కార్యదర్శులు గురువారం ప్రదర్శించారు. ఇప్పటివరకు ఉన్న పన్ను బకాయిలను ఆయా హక్కుదారులకు తెలియపరిచే విధంగా డిజిటల్ నోటీస్‌లను ఎస్‌ఎంఎస్‌లు, వాట్సాప్‌ల ద్వారా సమాచారం అందిస్తున్నారు. ఆస్తి పన్ను వసూలు విషయమై అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు. పన్ను చెల్లింపుదారులు నేరుగా కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాలతో పాటు సమీప వార్డు సచివాలయాలలో డబ్బులు చెల్లించేలా చర్యలు చేపట్టారు. అలాగే డిజిటల్ లావాదేవీల ద్వారా (ఫోన్ పే,గూగుల్ పే) ఆన్‌లైన్ చెల్లింపులను కూడా చేపట్టవచ్చని కమిషనర్ నల్లనయ్య వెల్లడించారు. అనుకున్న స్పందన రాకపోతే మొండి బకాయిదారులకు సంబంధించి కుళాయి, విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు.

సమర్థవంతంగా పౌర సేవలు



కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పౌరసేవలను మరింత సమర్థవంతంగా, నిర్దీత సమయానికి పూర్తయ్యే విధంగా చూడాలని ఎడ్యుకేషన్ కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎడ్యుకేషన్ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే సచివాలయాల ముఖ్య ఉద్దేశమని మరోసారి పునరుద్ఘాటించారు. కొంతమంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏఓ సీతారామమూర్తి పాల్గొన్నారు.

కషాయాలే.. శ్రీరామరక్ష!

- ప్రకృతి వ్యవసాయ కషాయాలతో చీడపీడల నివారణ
- తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంట, అధిక దిగుబడులు
- ఇంటి వద్దనే సులభంగా తయారీ కూడా..
- వినియోగానికి ఆసక్తి చూపిస్తున్న రైతులు



రేగిడిలో కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: రసాయన ఎరువుల వినియోగంతో అటు రైతులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. మరో వైపు ఎరువుల కృత్రిమ కొరతతో సాగుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎరువుల కొరతను అధిగమించడంతో పాటు మంచి ఫలసాయం పొందేందుకు అన్నదాతలంతా ప్రకృతి సేద్యం అవలంబించడం ప్రారంభించారు. ముఖ్యంగా ఎరువుల కొరతను ఎదుర్కొనేందుకు ప్రకృతి వ్యవసాయ విధానాలు ఉపయోగపడుతున్నాయి. ఇంటి వద్దే సులభంగా జీవామృతాలు, కషాయాలు, ద్రావణాలు తయారు చేసుకుని వాటిని పంటలకు వినియోగించడం ద్వారా పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారించుకుని, మంచి ఫలితాలు పొందుతున్నారు.

3 వేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం..

గత ఖరీఫ్ సీజన్‌లో రాజాం నియోజకవర్గంలో మూడు వేల ఎకరాల్లో అధికారికంగా ప్రకృతి వ్యవసాయం జరిగింది. అనధికారికంగా మరో మూడు వేల ఎకరాలకు పైబడి పొలాల్లో ప్రకృతి సేద్యం జరిగిందని సమాచారం. 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఈ సాగు రాజాం మండలంలోని రెండు, మూడు గ్రామాల్లో ప్రారంభించగా, అనతి కాలంలోనే సాగు విస్తీర్ణం అమాంతం పెరిగింది. వేసవిలో రైతులు ముందుగానే ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఎరువుల తయారీకి ముడిసరుకులను సిద్ధం చేసుకుంటున్నారు. రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటతో పాటు కూరగాయల సాగుకు ఈ ఎరువుల వినియోగంపై దృష్టి సారిస్తున్నారు.

జీరో పెట్టుబడి విధానం..

సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు తక్కువ పెట్టుబడితో కూడిన విధానాలు. రైతులంతా తమ ఇంటి వద్దే ఆయా పద్ధతుల ద్వారా ఎరువుల తయారీకి అవకాశం ఉంది. తక్కువ ఖర్చు, జీరో పెట్టుబడితో ఎరువులు తయారు కావడంతో రైతులంతా ప్రకృతి సాగు విధానాలపై దృష్టిసారిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగంలో భాగంగా పిల్లిపెసర, కట్టిజనుము పంటలు సాగు చేయడం, వీటిని విత్తనాలుగా చేసి, రెట్టింపు పంటను ఖరీఫ్ సీజన్‌లో వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు పొలాల్లో సేంద్రియ కార్బన్ శాతాన్ని పెంచుకునేందుకు మినుములు, పెసర, ఆముదం, బొబ్బర్లు, నువ్వులు, వేరుశనగ, దనియాలు, మెంతులు, ఆవాలు, రాగులు, కొర్రలు, సామలు వంటి చిరుధాన్యాల పంటలు సాగు చేస్తున్నారు. తక్కువ నీటి వనరులున్న ప్రాంతాల్లో మండు వేసవిలో కూడా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఇవి సాగులోకి వస్తున్నాయి.

ఒక్కరోజు వ్యవధిలో..

ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి కషాయాల తయారీ చాలా సులభం. ఆవుపేడ, వేపాకు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఆవుమూత్రం.. కషాయాల తయారీకి ప్రధాన ముడిసరుకులు. వీటిని తగిన మోతాదులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలతో వినియోగించి, ఒక్కరోజు వ్యవధిలో ఎరువులు తయారు చేసుకోవచ్చు. అగ్నిఅస్త్రం, ఘన, ద్రవ జీవామృతాలు, బీజామృతం వంటి కషాయాలు తయారు చేసి వరి, మొక్కజొన్న, చెరకు వంటి పంటలతో పాటు కూరగాయల సాగుకు వినియోగిస్తున్నారు. వీటి ద్వారా పంటలో వైవిధ్యం కనిపించడంతో పాటు పంటపొలాలు సారవంతంగా మారి నేలల్లో ఆర్గాన్, కార్బన్ ఉత్పత్తులు పెరుగుతాయి. అలాగే పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించుకోవచ్చు. ఫలితంగా వచ్చే పంట దిగుబడి అనేక పోషకాలు కలిగి మంచి ఆరోగ్యాన్ని అందిస్తుంది.



ఈ ముడిసరుకుతోనే కషాయాల తయారీ

రైతుల్లో అవగాహన పెరిగింది..

గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై, సేంద్రియ ఎరువుల తయారీపై రైతుల్లో అవగాహన పెరిగింది. ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఖరీఫ్ సీజన్‌లో ఘన, ద్రవ జీవామృతాలు, తూటికాడ కషాయాలకు మంచి డిమాండ్ ఉంది. సాగుకు ముందుగానే పొలాల్లో ఆవుపేడ, పెంటగత్తం, పిల్లిపెసర, కట్టిజనుమ వంటివి సాగు చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయి. – పి.రమాదేవి, ప్రకృతి వ్యవసాయం ఎల్‌వన్ అధికారిణి, రాజాం

రక్తదాన శిబిరం..



ప్రపంచ ఎన్జీఓ దినోత్సవం సందర్భంగా మదర్ థెరీసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. నగరంలోని అయ్యన్నపేట జంక్షన్ వద్ద గల కిడ్స్ క్లబ్‌లో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని విజయనగరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవిశంకర ప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మదర్ థెరీసా సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు త్యాడ వేణుగోపాలం, ఎస్‌కే డిగ్రీ కాలేజ్ ఎన్‌సీసీ ఆఫీసర్ సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు శ్రావణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.
– విజయనగరం

అన్న సమారాధన



జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి నేతృత్వంలో సుమారు ఐదు వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పద్మావతి, ప్రధానార్చకుడు సోమశేఖర్ శర్మ, కమిటీ సభ్యులు భీమరాజు, శోభారాణి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
– విజయనగరం టౌన్

హుండీల ఆదాయం లెక్కింపు..



డెంకాడ మండలం జొన్నాడ గ్రామంలో వేంచేసి ఉన్న పైడితల్లి ఆలయంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ నెల 13 నుంచి 27 వరకు 1,55,913 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి జి.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏకసభ్య ధర్మకర్త జి.శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, గ్రామపెద్దలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.
–డెంకాడ

అభివృద్ధి పనుల నాణ్యత పరిశీలన

బాడంగి: మండలంలోని మల్లంపేట, గూడెపువలస, అల్లువానివలస, రావివలస, పిన్నవలస, కామన్నవలస గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల నాణ్యతను క్యూసీ(క్వాలిటీ కంట్రోల్) డీఈఈ వి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారుల బృందం గురువారం తనిఖీ చేశారు. పూర్తయిన రోడ్లు, కాలువల నమూనాలను సేకరించి, నాణ్యత పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో జేఈ శ్రీనివాసరావు, పీఆర్ డీఈఈ సీహెచ్ అప్పారావు, జేఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన

రేగిడి: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రేగిడి మండలం వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడును మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అభినందించారు. విజయనగరం జిల్లా, చీపురుపల్లిలోని తన నివాసానికి గురువారం వచ్చిన అచ్చెన్నాయుడును మాజీ ఎంపీ బెల్లాన అభినందించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.